'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# ఎన్నాళ్లకీ వేటు?

మహిళా రెజ్లర్ల పోరాటం తాత్కాలికంగా విజయం సాధించింది. 11 నెలలుగా వారు చేస్తున్న 'మల్ల యుద్ధాన్ని' తట్టుకోలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దిగివచ్చింది. ఇటీవల ఎన్నికైన రెజ్లింగ్ ఫెడరేషన్ నూతన పాలకమండలిపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ వేటువేయడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ నిర్ణయంతో బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ షాక్‌కు గురయ్యాడు. దీంతో నూతన అధ్యక్షుడు సంజయ్‌సింగ్‌ను అడ్డుపెట్టుకొని మరోసారి రెజ్లింగ్ సమాఖ్యను ఏలాలని భావించిన ఆయన ఆశలు ఆవిరయ్యాయి. అసోసియేషన్ వ్యవహారాలకు దూరంగా ఉంటానని కూడా ఆయన ప్రకటించటం వెనుక బీజేపీ అధిష్ఠానం ఆదేశాలున్నట్టు స్పష్టమవుతున్నది. తాజాగా సస్పెన్షన్‌కు గురైన పాలకమండలి కూడా బ్రిజ్‌భూషణ్ కనుసన్నల్లో నడిచేదేనన్నది జగమెరిగిన సత్యం. వీరవిధేయుడైన సంజయ్‌సింగ్ ద్వారా మరోసారి రెజ్లింగ్‌ను శాసించాలని ఆయన అనుకున్నారు. సంజయ్‌సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రోజు ఢిల్లీలోని నివాసంలో తానే గెలిచినంతలా బ్రిజ్‌భూషణ్ సంబురాలు చేసుకోవడమే దీనికి నిదర్శనం.

దేశాన్ని కుదిపేసిన రెజ్లర్ల వ్యవహారంపై ఇన్నేండ్లు మౌనం వహించడమే బీజేపీ చేసిన పాపం. అంతేకాకుండా పరోక్షంగా బ్రిజ్‌భూషణ్‌కు మద్దతుగా నిలవడం విమర్శలకు తావిచ్చింది. కైసర్‌గంజ్, అయోధ్య, గోండా, బహరాయిచ్, బలరామ్‌పూర్, శ్రావస్తి జిల్లాల్లో బ్రిజ్ భూషణ్‌కు పట్టున్నది. తూర్పు ఉత్తరప్రదేశ్ రాజకీయాలను ఆయన శాసిస్తుండటమే కేంద్రం మౌనానికి కారణం. అయితే సంజయ్‌సింగ్ ఎన్నికకు నిరసనగా సాక్షి మాలిక్ కుస్తీలకు స్వస్తి చెప్పగా.. బజరంగ్ పునియా, బధిర ఒలింపిక్స్ రెజ్లింగ్ చాంపియన్ వీరేందర్ సింగ్ పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇచ్చేస్తామని ప్రకటించారు. దీంతో బీజేపీ మరింత ఇరకాటంలో పడింది. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ అంశం మరోసారి తెరపైకి వస్తే తమకు ప్రతికూలంగా మారుతుందని బీజేపీ భావించి ఉండవచ్చు.

వచ్చే ఏడాది జరుగనున్న హర్యానా ఎన్నికలపై రెజ్లర్ల ప్రభావం ఎక్కువ. జాట్ల ఓట్లు ఎక్కువగా ఉండే హర్యానాలో ప్రతి పల్లెలో మల్ల యోధులుంటారు. వారికి కుస్తీ అనేది ఒక సెంటిమెంట్. ఇన్ని రోజులు పెదవి విప్పని బీజేపీ ఇటు సార్వత్రిక, అటు హర్యానా అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యానే ఇప్పుడు చర్యలు చేపట్టిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా ఎన్నికైన సమాఖ్యపై వేటు.. అసోసియేషన్ వ్యవహారాల నుంచి బ్రిజ్‌భూషణ్ రిటైర్మెంట్ వంటి ప్రకటనలు ఇందుకు ఊతమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలు ముగియగానే సస్పెన్షన్ ఎత్తివేస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతున్నది. అదే కనుక జరిగితే రెజ్లర్ల పోరాటం మళ్లీ మొదటికొస్తుంది. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయాన్ని స్వాగతించిన రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించడమే ఇందుకు ఉదాహరణ.

# కాంగ్రెస్ విధానాలు.. కఠోర అవాస్తవాలు

ఒక మనిషి అయినా, రాజకీయ పార్టీ అయినా, తన వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే రాను రాను మనుగడ కష్టమవుతుంది. కొన్నాళ్లు లేక కొన్నేండ్లు పరిపాలించిన పార్టీకి ప్రజల నాడి తెలుసుకునే నైపుణ్యం పెరగాలి. నేనింతే అనుకుంటే పదే పదే వైఫల్యాలనే ఎదుర్కొనవలసి వస్తుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ర్టాలను బీజేపీకి అప్పగించింది కాంగ్రెస్. ఇక కొంతకాలం కిందట జరిగిన కర్ణాటక ఎన్నికల్లో గెలిచినా, అది కాంగ్రెస్‌ను కావాలని గెలిపించటం కాదు, బీజేపీ వద్దు అన్న నకారాత్మక తీర్పు అది. ఇక తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది కేవలం ప్రచారహోరుతోనే అన్నది సుస్పష్టం. ఎన్నికల తర్వాత కూడా అధిక సంఖ్యలో ప్రజలు కేసీఆరే తమకు ముఖ్యమంత్రిగా కావాలని చెప్పటం బీఆర్ఎస్ పార్టీ విజయం. ఈ తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో జరిగిన అత్యద్భుత ప్రగతికి తార్కాణం.



కనకదుర్గ దంటు
89772 43484



**75 ఏండ్లలో** అధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ కానీ, వారిని విమర్శించి అధికారం చేపట్టిన జనతాదళ్, భారతీయ జనతా పార్టీ కానీ కల్పించని మౌలిక వసతులు తెలంగాణలో కేసీఆర్ కల్పించారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, 24 గంటల నిరంతరాయ కరెంటు, పల్లెల్లో కూడా రోడ్లు, శుభ్రత, వాతావరణ స్వచ్ఛత కోసం కోట్ల కొద్దీ మొక్కల నాటింపు, విద్యా వికాసం కోసం 1200 పైగా గురుకులాలు, జూనియర్ ఇంటర్, డిగ్రీ, మెడికల్ కాలేజీలు, వైద్య సదుపాయం కోసం పీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానలు, పట్టణాల నగరాల దవాఖానల్లో సూపర్ స్పెషాలిటీ సేవలు, జిల్లాల్లో ఉచిత డయాలసిస్, వైద్య పరీక్షా కేంద్రాలు, మారుమూల పల్లె వాసులకు కూడా ప్రసూతి సౌకర్యాలు, గర్భిణీ స్త్రీలకు ఆహారం, అన్నింటి కంటే ముఖ్యమైనదిగా చెప్పవలసినది వ్యవసాయరంగ పరిరక్షణ. దీనిని మొట్టమొదటి ప్రాధాన్యాంశంగా తీసుకుని దాదాపు ఐదు దశాబ్దాలు ఉమ్మడి రాష్ట్రంలో బక్కచిక్కిన తెలంగాణ సాగు ను ఉద్ధరించారు. ఏడు మండలాలు ఆంధ్రలో విలీనంతో కోల్పోయిన లోవర్ సీలేరు ప్రాజెక్టు, అప్పుడే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబు నాయుడు సృష్టించిన కరెంటు కష్టాలు దీటుగా ఎదుర్కొని కరెంటును సరఫరా చేయటమే కాకుండా, దశాబ్దాల తరబడి మూలబడ్డ ప్రాజెక్టులను తీసుకొని అనతికాలంలో పూర్తిచేసి రైతన్నలకు కావలసిన నీటిని సాగుకు అందించారు. ఈ రెండూ లభ్యమవ్వటంతో వ్యవసాయం కళకళలాడింది. వీటికి తోడుగా రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందించటంతో రైతులకు అప్పుల బాధ తప్పింది. పంటలు ఇబ్బడిముబ్బడిగా పెరిగి, దేశంలో ఎక్కడా లేనంతగా తెలంగాణ రైతు బాగుపడ్డాడు. నిజానికి కేసీఆర్ పదే పదే చెప్పినట్టుగా ఈ విధానాలన్నీ స్వాతంత్ర్యం వచ్చిన పది, పదిహేనేండ్లలో జరగాల్సినవి.

> సరైన విపక్షమే లేకుండా అప్రతిహతంగా కాంగ్రెస్ పాలన సాగటంతో, వారికి తమ అధికారం, తమ అవినీతి సంపాదన తప్ప ఇంకేమీ పట్టలేదు. దేశంలో మౌలిక వసతులు, తప్పనిసరి ప్రాథమిక విద్య కల్పించాలన్న సోయి లేకుండా, యథేచ్ఛగా పాలన సాగించారు. ప్రపంచంలో ఏ దేశంలో లేనంత వైవిధ్యం ఉన్న భారతదేశానికి సరిపోని విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి, దశాబ్దాలు అదే కొనసాగించి, ప్రగతిశీల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా విపరీతమైన మేధోవలస జరుగుతుంటే పట్టనట్టు ఉండిపోయారు.

ఇక వీరి పాలనకు విసిగి భారతీయ జనతా పార్టీని గెలిపించిన ప్రజలకు పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయింది. మత మౌఢ్యంతో పక్షపాత వైఖరితో, నియంతృత్వ పోకడలతో సాగిన బీజేపీ పాలనలో గొప్పవారు కుబేరులు, మధ్యతరగతి వారు బీదవారై కొట్టుమిట్టాడుతున్నారు. నిర్భయ కేసు గురించి అంత అల్లరి, గొడవ చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీకి అత్యాచారాల మీద ఉన్న చట్టాలు కఠినతరం చేయటానికి పదేండ్ల సమయం పట్టింది. అదే గొప్పగా చెప్పుకొంటున్నారు కేంద్ర హోంమంత్రి. మరి ఇప్పటికీ సొంత పార్టీ నేతలు చేసిన నేరాలు పార్లమెంటులో చర్చించటానికి కూడా ఇష్టపడనివారు ఈ చట్టాలని అందరికీ వర్తింపజేస్తారా? లేక బుల్డోజర్ సూత్రంలాగా తమ శత్రువుల మీద మాత్రమే ప్రయోగిస్తారా? కాలమే దానికి సమాధానం చెప్పాలి.

ఇక ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర పరిస్థితికి వస్తే, అధికార పార్టీ రాజకీయాలు ప్రజా పాలన దిశగా కాకుండా, కేవలం కక్ష సాధింపు చర్యలుగా ఉండటం దురదృష్టకరం. గతాన్నే తవ్వుకుంటూ బతికేవాడికి భవిష్యత్తు ఉండదు. వర్తమానం నిన్నటి చర్యల ప్రతిఫలం ఇస్తే, భవిష్యత్తు వర్తమాన చర్యల ఫలం ఇస్తుంది. పాలనలో ప్రతిరోజూ ప్రతి గంటా ప్రతి నిమిషం చాలా ముఖ్యం. ఈ సమయాన్ని వృథా చేసి ప్రజలకిచ్చిన వాగ్దానాలు వాయిదా వేస్తూ పోతే, రాష్ట్ర ప్రగతి కుంటుపడుతుంది. అంతేకాదు, అబద్ధాలు చెప్పినంత మాత్రాన ప్రజల కండ్లముందు కనిపిస్తున్న ప్రగతిని మాయం చేయలేరు. ఈ వసతులు తీసెయ్యటం, తగ్గించటం లాంటివి ప్రజలు ఒప్పుకోరు. అది పాలకులు గుర్తు పెట్టుకోవాలి.

ఇంకొక విషయం కాంగ్రెస్ పార్టీ గమనించి, గుర్తుపెట్టుకోవాలి. బీఆర్ఎస్ పార్టీ మొదలుపెట్టిన ప్రగతిశీల ప్రణాళికలు తిరోగమన చర్యలతో మారిస్తే, దానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఫార్మాసిటీ స్థాపించటానికి సేకరించిన వేల ఎకరాల్లో కేవలం మనుషులు నివసించటానికి ఇండ్లు కట్టి ఇంకా లక్షల మందిని హైదరాబాద్‌లో చేరవేయవలసిన పని ప్రభుత్వానికి లేదు. కరోనా సమయంలో హైదరాబాద్ ఒక ప్రముఖ ఫార్మా కేంద్రంగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఇక్కడ 19 వేల ఎకరాల్లో ఫార్మసీ పరిశ్రమ పెడితే ప్రపంచంలోనే ఒక ముఖ్యమైన ఫార్మా కేంద్రం అవుతుందనటంలో సందేహం లేదు. అదే జరిగితే కోట్లలో పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు, వేలకొద్దీ ఉపాధి మార్గాలు ఆ చుట్టుపక్కల వెలుస్తాయి. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారక్కరలేదు. ఆ చుట్టుపక్కల వందల కొద్దీ లే అవుట్లు వచ్చి, గృహాలు నిర్మితమై జనాలు చేరతారు. ప్రభుత్వానికి పైసా ఖర్చులేకుండా సమయం వృథా కాకుండా ఆ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుంది. ఇటువంటి పురోగమన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడితే ప్రజలు హర్షిస్తారు. ఇదే కాకుండా, బీఆర్ఎస్ ప్రభుత్వం లాగా, ఇంకా ఏ పరిశ్రమలు రాష్ట్రానికి కావాలో ఆలోచించి, ఆ దిశగా కృషిచేస్తే వారికీ మంచిది, రాష్ట్ర ప్రగతికీ తోడ్పడుతుంది. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఆ రైతులు తమ విలువైన భూమిని ఇవ్వలేదని గ్రహించటం ప్రభుత్వానికి శ్రేయస్కరం. పనికిరాని, చెయ్యలేని ఫ్రీ బస్సు ప్రయాణాలు, ఫ్రీ స్కూటీ బహుమతులు కాకుండా, రేషన్‌లో 10 కిలోల కంది పప్పు, 10 కిలోల మినప్పప్పు, 5 కిలోల వంట నూనె ఇస్తే అన్ని కుటుంబాలు సంతోషిస్తాయి. ఇలా మహిళలు ఫ్రీ బస్సులెక్కి తిరిగితే మగవారు ఆటోలు నడపలేక అవస్థలు పడరు. మంచి పథకాలు, కుటుంబం అంతా లబ్ధి పొందేవి ఆలోచించాలి కాంగ్రెస్ ప్రభుత్వం.

> అప్పులో, సప్పులో వారసత్వంగా వచ్చింది భరించటమే ఎన్నికైన ప్రభుత్వాల విధి. జరిగిపోయిన దాన్ని మించి జరగబోయే దానిమీద దృష్టి పెడితే, సమస్యలు త్వరగా తీర్చుకోవచ్చు. నకారాత్మక చర్యలు మాని, సకారాత్మక ఆలోచనలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం, తను చేసిన వాగ్దానాల దిశగా దృష్టి మళ్లించవచ్చు. గతాన్ని తవ్వుకుంటూ ఏడ్చేవాడిని ఎవ్వరూ ఎక్కువ కాలం భరించరు. భవిష్యత్తు ప్రణాళికలు రచించి, వర్తమానంలో కార్యాచరణ ప్రారంభించాలి. అప్పుడే ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అలా చేసింది కాబట్టే ఇంత ప్రగతి సాధించగలిగింది.

# ప్రజాస్వామ్యమా? నియంతృత్వమా?

ప్రపంచంలో అన్ని దేశాల కంటే దృఢమైన రాజ్యాంగం మనది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా కూడా భారత్‌కు గుర్తింపు ఉన్నది. అలాంటి ఈ దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన ఎంపీల సస్పెన్షన్ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ప్రజల గొంతుకలుగా ఉన్నటువంటి పార్లమెంట్ సభ్యులను చట్టసభల నుంచి బయటకు పంపించడం ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నది.



జూపల్లి రమేష్ రావు
94925 70992

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 146 మంది లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను సస్పెండ్ చేయడం కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరును ప్రస్ఫుటం చేస్తున్నది. 75 ఏండ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్న ఈ గడ్డపై కోట్లాది మందికి ప్రతినిధులైన 146 మంది ఎంపీలను ఒకే సెషన్‌లో సభా కార్యకలాపాల నుంచి బహిష్కరించడం ఇదే తొలిసారి. గతంలో ఇందిరాగాంధీ హత్య సమయంలో భారీగా ఎంపీలను సస్పెండ్ చేశారు. అయితే ఇప్పుడు అంతకు రెట్టింపు మందిని ఒక సెషన్‌లోనే సస్పెండ్ చేయడం విడ్డూరంగా మారింది. ప్రజాస్వామ్య దేశమంటే ఇదేనా? అన్న ప్రశ్నలు నేటి తరం యువతలో మెదులుతున్నాయి. ప్రశ్నించడానికి, ప్రజల సమస్యలను ప్రస్తావించడానికి ఎన్నికల్లో ఓటేసి గెలిపించిన ప్రజా ప్రతినిధులను అధికార కేంద్ర ప్రభుత్వ సూచనలతో ఇలా చేయడం సహేతుకమైనది కాదు. ఇది నిజంగా ప్రజాస్వామ్య విలువలకు, ప్రజాస్వామ్య దేశానికి కళంకమే.

తాజాగా కేంద్ర ప్రభుత్వంలోని గణాంక శాఖ వెలువరించిన లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 144 కోట్లు. చైనాను దాటుకొని ప్రపంచంలోనే అత్యధిక జనాభాను కలిగిన మన దేశంలో 543 మంది లోక్‌సభ సభ్యులున్నారు. వీరంతా ప్రత్యక్ష ఎన్నికల్లో నేరుగా ప్రజల ఓట్లతో ఎన్నికైనవారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో దేశ సార్వభౌమత్వాన్ని రక్షించడం, ప్రజల తరపున గళం వినిపించడం ఎంపీల ప్రధాన విధి. ఒక్కో ఎంపీ తాజా జనాభా లెక్కలను అనుసరించి దాదాపుగా 25 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యసభలో మొత్తం 250 మంది సభ్యులుండగా ఇందులో 12 మంది మాత్రమే రాష్ట్రపతి ద్వారా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఎంపికవుతారు. మిగిలిన 238 మంది పెద్దల సభలకు ఎన్నికల సంఘం విధివిధానాల ద్వారా వచ్చేవారే. వీరు కూడా దేశ ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తూ దేశానికి అవసరమైన చట్టాల రూపకల్పనలో పాలుపంచుకుంటారు. సలహాలు, సూచనలు అందిస్తారు. ప్రజల సమస్యలను లేవనెత్తే పార్లమెంట్ సభ్యులను ఒక కలం పోటుతో సమావేశాల నుంచి బయటకు పంపడం అన్నది నిజంగా హేయమైనది. ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యానికే కాకుండా దేశ ప్రజలకు అవమానకరం. ఈ నెల 14న 14 మంది ఎంపీలతో మొదలైన బహిష్కరణ పర్వం 18న 78 మందితో సస్పెన్షన్ వేటు కొనసాగింది. మరుసటి రోజు మరో 49 మంది గొంతు నొక్కగా ఈ సంఖ్య 141కు చేరింది. ఈనెల 20న ఇద్దరు, పార్లమెంట్ సమావేశాల చివరి రోజు మరో ముగ్గురు ఎంపీలను సస్పెండ్ చేయడంతో ఈ సంఖ్య 146కు చేరుకున్నది.



> సరిగ్గా 22 ఏండ్ల కిందట 2001, డిసెంబర్ 13న భారత పార్లమెంట్‌పై ఉగ్రమూకల దాడిలో 9 మంది అసువులు బాశారు. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. యూపీఏ సర్కారు భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపింది. సీన్ కట్ చేస్తే అదే డిసెంబర్ 13న మరోసారి పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం జరిగింది. ఈసారి ఏకంగా లోక్‌సభలోకి ఇద్దరు వ్యక్తులు నేరుగా ప్రవేశించి అలజడి సృష్టించడం కలకలం రేపింది. అందులోనూ డిసెంబర్ 13నే ఈ ఘటన జరగడంతో 144 కోట్ల మంది ప్రజల్లో అనేక అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

భద్రతా వైఫల్యంపై యావత్ దేశం మోదీ సర్కారు తీరును ఎండగడుతున్న సందర్భంలో బాధ్యతాయుతమైన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్ష పార్టీలు నిలదీయడం ప్రతిపక్షాలుగా వారి కనీస బాధ్యత. కేంద్రమే స్వయంగా కల్పించుకొని ఈ వ్యవహారంపై నోరు విప్పి నిష్పక్షపాతంగా ప్రకటన చేస్తే అంతా చల్లబడేది. అందుకు విరుద్ధంగా ఎన్డీయే సర్కారు వ్యవహరించడం ద్వారా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పార్లమెంట్ ఉభయ సభల్లో శాంతియుతమైన నిరసనలను తలపెట్టడం ఏ మాత్రమూ తప్పుకాదు. ప్రధాని మోదీ మీడియా ముందుకు రారు. కనీసం మీడియా సమావేశాలను నిర్వహించరు. నేరుగా ప్రజలతో మాట్లాడరు. కలిసేది అంతకంటే లేదు. ఒకవేళ ఆయన మాట్లాడాల్సి వస్తే 'మన్ కీ బాత్'లో ప్రసంగిస్తారు. అంతే తప్ప ప్రజల సాధక బాధకాలను స్వయంగా చూసిన దాఖలాలు లేవు. దేశంలోని సమస్యలు, ప్రశ్నలకు కేంద్ర సర్కారు నుంచి సమాధానాలను ఆశించడం గగనమైపోయింది. గత్యంతరమే లేని ఈ క్లిష్ట సమయంలో పార్లమెంట్ సభ్యులు గొంతెత్తిన పాపానికి వారిని బయటకు పంపడం అంటే ప్రజాస్వామ్య గొంతును నొక్కడమే. పార్లమెంట్ సాక్షిగా మనం రాసుకున్న రాజ్యాంగ విలువలను పాతిపెట్టడమే అవుతుంది.

పార్లమెంట్ సమావేశాల నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎంపీలంతా నిరసనకు దిగి పెద్దఎత్తున కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును వారు ప్రశ్నించారు. అందులో భాగంగానే ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను అనుకరిస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీ నిరసనను వ్యక్తం చేశారు. మాక్ పార్లమెంట్ మాదిరిగానే సభ్యులంతా కలిసి వినూత్నంగా చేసిన ఈ నిరసనకు ఉప రాష్ట్రపతి నొచ్చుకోవడం ఇప్పుడొక పెద్ద సమస్యగా మారింది. ఇదిప్పుడు జాతి సమస్యగా, దేశం ఎదుర్కొంటున్న భారీ సవాల్‌గా కేంద్రంలోని పెద్దలంతా చిత్రీకరిస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుంది. అందులో పార్లమెంట్‌లో ప్రజల గొంతుకై తమ వాణిని వినిపించాల్సిన వ్యక్తుల గొంతు నొక్కినప్పుడు వారంతా పార్లమెంట్ వెలుపల నిరసన తెలియజేయడం కూడా తప్పే అన్నట్టుగా కేంద్రం వకాల్తా పుచ్చుకోవడం విడ్డూరంగా ఉన్నది. భద్రతా వైఫల్యంపై నిరసన చేస్తున్న ఎంపీలను బయటకు పంపిన రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు పార్లమెంట్ వెలుపల ఎంపీల నిరసన కూడా అదే రీతిలో కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సిన లోక్‌సభ, రాజ్యసభ స్పీకర్లు ఆవేశకావేశాలకు లోనుకాకుండా పార్టీలకు అతీతంగా ఎంపీల చర్యలను చూడాల్సి ఉంటుంది. ఒకరికి వత్తాసు పలుకుతున్నట్టుగా చర్యలు తీసుకుంటే వాటి పర్యావసానాలు సైతం అదే స్థాయిలో ఉంటాయి. అందుకు సస్పెన్షన్ చేసిన వ్యక్తులు ఓపికగా భరించాల్సిందే. లేదంటే రాజ్యాంగ సవరణతో నిరసనలపై ఉక్కుపాదం మోపితే సరిపోతుంది. అనేక అంశాలపై రాజ్యాంగ సవరణలు చేసే వారికి ఇదేం పెద్ద పనేమీ కాదు కదా?



## నియంతృత్వాన్ని అడ్డుకుందాం!

*నాడు మనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడాం. ఇప్పుడు వీటిని కాపాడుకునేందుకు పోరాడాల్సి వస్తున్నది. ప్రస్తుతం మన దేశం విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నది. నియంతృత్వం మనదాకా వచ్చింది. దాన్ని ఆపి తీరాలి. ఈసారి చిన్న పొరపాటు జరిగినా.. నియంతృత్వమే రాజ్యమేలుతుంది. అందుకే నేడు భారతదేశం స్వేచ్ఛను కోరుకుంటున్నది.*

**- ఉద్ధవ్ ఠాక్రే, శివసేన** (యూబీటీ) అధ్యక్షుడు

కాలగమనంలో మరో ఏడాది ముగింపు దశకు చేరుకున్నది. మరికొద్ది రోజుల్లో 2023కు స్వస్తి పలికి 2024లో అడుగిడబోతున్నాం. రాబోయే ఏడాది యావత్ ప్రపంచానికి ఎంతో కీలకమైనది. ఎందుకంటే, ఈ ఏడాది ఎన్నికల నామ సంవత్సరంగా నిలవబోతున్నది. 21వ శతాబ్దాన్ని శాసిస్తున్న అనేక దేశాల్లో ఎన్నికల కోలాహలం కనిపించనున్నది.

# 2024 - ఎన్నికల నామ సంవత్సరం

ప్రపంచంలోని 40కి పైగా దేశాల్లో 2024లో ఎన్నికలు జరుగనున్నాయి. సుమారు 40 శాతానికిపైగా ప్రజలు ఈ క్రతువులో పాలుపంచుకోనున్నారు. ప్రపంచ జీడీపీలో అత్యధిక శాతాన్ని ఈ దేశాలు కలిగి ఉండటం గమనార్హం. ప్రపంచ పెద్దన్నగా చెప్పుకొనే అమెరికా, అప్పట్లో ఓ వెలుగు వెలిగిన రష్యా, ప్రపంచ శక్తిగా రూపాంతరం చెందుతున్న భారత్, బ్రిటన్, మెక్సికో, దక్షిణాఫ్రికా, చిన్న దేశాలైన ఇరాన్, దక్షిణ సూడాన్, తైవాన్, భూటాన్‌తో పాటు యూరోపియన్ యూనియన్ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే వీటిలో కొన్ని దేశాల ఎన్నికలను యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ఎందుకంటే.. అక్కడ కొలువుదీరబోయే ప్రభుత్వాధినేతలను బట్టి ఆయా దేశాలతో పాటు ప్రపంచ భవితవ్యం ఆధారపడి ఉన్నది. అమెరికా, రష్యా, భారత్, మెక్సికో, బ్రిటన్, దక్షిణాఫ్రికా, యూరోపియన్ యూనియన్ ఈ జాబితాలో ఉన్నాయి.

భారతీయులు అత్యధికంగా ఉండే అమెరికా ఎన్నికలను అటు ఆ దేశంతో పాటు మన భారతీయులు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు. అక్కడ కొలువుదీరే ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బట్టి ఆ దేశంలోని ప్రవాస భారతీయుల భవితవ్యం ఆధారపడి ఉంటుంది. దాంతో పాటు వీసాల సంఖ్య పెంపు, గ్రీన్‌కార్డుల జారీ తదితర అంశాలు దీంతో ముడిపడి ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. వచ్చే ఏడాది నవంబర్‌లో అమెరికా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే 81 ఏండ్ల వయసు ఆయనకు ప్రతికూలంగా మారే ప్రమాదం ఉన్నది.

అమెరికన్లు మరోసారి ఆయనపై నమ్మకం పెట్టుకుంటారా? లేదా? అనేది తేలాల్సి ఉన్నది. రిపబ్లికన్ పార్టీ తరఫున 77 ఏండ్ల మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి బరిలోకి దిగుతున్నారు. ఆ పార్టీ తరఫున అభ్యర్థిత్వం విషయంలో ట్రంప్ కాస్త ముందంజలో ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే పలు అభియోగాలను ఎదుర్కొంటున్న ఆయనపై తాజాగా అక్కడి కోర్టు అనర్హత వేటు వేయడం ప్రతికూలంగా మారింది. పైకోర్టులకు అప్పీల్ వేసుకునే వెసులుబాటు ఉండటం ఊరట కలిగించే అంశం. ఒబామా హయాంలో తన కుమారుడు అయాచితంగా లబ్ధి పొందినట్టు ఆరోపణలు రావడంతో బైడెన్ ప్రచారంలో కాస్త వెనుకబడ్డారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం భారతీయ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి కూడా బరిలో ఉండటం విశేషం. ఉక్రెయిన్‌కు ఆర్మీ పరంగా అమెరికా అధికంగా సాయం చేస్తున్నదని ఇప్పటికే ట్రంప్ విమర్శిస్తున్నారు. ట్రంప్ మరోసారి అధికారం చేపడితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై కూడా ప్రభావం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఉక్రెయిన్‌తో సుదీర్ఘంగా యుద్ధం చేస్తున్న రష్యా కూడా 2024లో ఎన్నికలను ఎదుర్కొంటున్నది. మార్చిలో అక్కడ ఎన్నికలు. సుదీర్ఘ కాలం పాటు అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ మరోసారి బరిలో నిలుస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. 71 ఏండ్ల పుతిన్ 2036 వరకు అధికారంలో ఉండేందుకు వీలుగా గతంలోనే రాజ్యాంగ సవరణ చేశారు. అప్పటివరకు అధికారంలో కొనసాగితే అత్యధిక కాలం రష్యాను పాలించిన జోసెఫ్ స్టాలిన్‌ను అధిగమించి పుతిన్ సరికొత్త రికార్డు సృష్టిస్తారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి తన రాజకీయ ప్రత్యర్థులపై ఆయన ఉక్కుపాదం మోపారు.



చిరకాల ప్రత్యర్థి నావెల్నీ ఇప్పటికే జైలు శిక్షను అనుభవిస్తున్నారు. దీంతో ఆయనపై పోటీ పడేందుకు ప్రత్యర్థులే కానరావడం లేదు.

> 140 కోట్ల జనాభా మన దేశంలో ఏప్రిల్-మేలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత అధికార పార్టీ బీజేపీ, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ తప్పకపోవచ్చు. హిందీ బెల్టు రాష్ర్టాలు, హిందూ ఓటర్లపైనే బీజేపీ ఆశలు పెట్టుకున్నది. అందుకే ఆ వర్గాన్ని ఆకర్షించే దిశగా ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నది. సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్ భావించిన ఐదు రాష్ర్టాల ఎన్నికల్లో చతికిలపడ్డ కాంగ్రెస్.. ఇండియా కూటమి సహకారంతో బీజేపీని ఎదుర్కొనేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది.

వచ్చే ఏడాది జూన్‌లో యూరోపియన్ యూనియన్ ఎన్నికలకు తెరలేవనున్నది. 20కి పైగా దేశాలకు ఈయూ ప్రాతినిధ్యం వహిస్తుండటం గమనించదగ్గ విషయం. బ్రిటన్‌లో ముందస్తు ఎన్నికల సూచనలు కనిపిస్తున్నాయి. జూన్‌లో మెక్సికో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. ఆ దేశ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ఇద్దరు మహిళలు ముందంజలో ఉండటం గమనార్హం. మెక్సికో సిటీ మాజీ మేయర్ క్లాడియా షెన్‌బౌమ్, గాల్వేజ్‌లలో ఒకరు ఆ దేశ మొదటి మహిళా అధ్యక్షురాలిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. దక్షిణాఫ్రికా ఎన్నికలు కూడా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. స్వతంత్రంగా ఉండేందుకు మొగ్గుచూపే డీపీపీ అభ్యర్థి లి చింగ్ తే.. తైవాన్ ఎన్నికల్లో గెలిచే సూచనలు కనిపిస్తుండటం చైనాకు మింగుడు పడని అంశం. హిమాలయ దేశం భూటాన్‌లో ఇప్పటికే మొదటి విడత ఎన్నికలు ముగిశాయి. వచ్చే జనవరి 9న రెండో విడత జరుగనున్నది. రక్షణ పరంగా భారత్‌కు భూటాన్ వ్యూహాత్మక దేశం. అక్కడ జరిగిన మొదటి విడత ఎన్నికల్లో భారత్‌కు అనుకూలంగా వ్యవహరించే పీడీపీ ముందంజలో ఉండటం మన దేశానికి ఊరట కలిగించే అంశం. ప్రపంచ గతిని మలుపు తిప్పనున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఎటువైపు మొగ్గుచూపుతారో చూడాలి మరి.

**- ఎడిటోరియల్ డెస్క్**